# 2

# హంసపాదు

"పిల్లి పేరేమిటన్నారూ?"

"సుశీల."

"అమ్మాయి చెబితే—" అని సాగతీశాడు మధ్యవర్తిగా వచ్చిన పెద్దమనిషి.

"పాటలేమయినా వచ్చా—" అన్నది పెళ్లికొడుకు చెల్లెలు.

"బళ్లో నేర్చుకున్న పాటలే. ఇంట్లో సంగీతం చెప్పించలేదు" అన్నది పెళ్లికూతురు తల్లి సావిత్రి.

"అబ్బాయి ఏంచేస్తున్నాడూ?" అన్నాడు పెళ్లికూతురు తండ్రి శేషు.

"మీ శిష్యుడేగా! మరచిపోయినారా యేం? మీదగ్గర ఘోస్తుఫారం—" అన్నాడు మధ్యవర్తి.

"అవు నవును—ఇప్పు డేం చేస్తున్నాడో తెలుసుకుందామనీ" అన్నాడు పెళ్లికూతురు తండ్రి శేషు.

"బి. కామ్. పాసైనాడు. టైపూ, షార్టుహాండూ

లోయరు పాసైనాడు. హయ్యర్ చదువుతున్నాడు''
అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

''ఓ పాట పాడిస్తారూ ?'' అన్నది పెళ్లికొడుకు చెల్లెలు.

''పాటలకు ఇప్పుడేం తొందరలే! మన ఇంటికి వచ్చిన తరువాత రోజూ కావలసినన్ని పాటలు'' అన్నది పెళ్లికొడుకు తల్లి, నవ్వుముఖం పెట్టి, ఓరకంటితో పెళ్లికూతుర్ని చూస్తూ.

''ఎంతవరకూ చదివిందన్నారూ ?'' అన్నాడు పెళ్లికొడుకు. అని ఓ క్షణంసేపు పెళ్లికూతురువంక చూచాడు. చూచి, మళ్లీ ఏమీ ఎరగనట్టు శేషువంక చూస్తూ కూర్చున్నాడు.

''మార్చిలో స్కూల్ ఫైనల్ పబ్లిక్‌కు వెళ్లింది. భగవంతుని దయవల్ల పాసైతే ఇంకా చదివించాలని అనుకుంటున్నాను'' అన్నాడు శేషు.

''బావుంది—చక్కగా వుంది. ఇంకా ఆలస్యమేమిటి? తాంబూలాలు పుచ్చుకోవడం, ముహూర్తం పెట్టుకోవడం—అంతేనా అన్నయ్యా?'' అన్నాడు మధ్యవర్తి.

''అంతే—అంతే—'' అన్నాడు పెళ్లికొడుకు తండ్రి అనుమానంగా—ముభావంగా—సంతృప్తిగా.

సరిగ్గా అదే క్షణాననో, ఇంకా కొంచెం ముందుగానో శేషు తలమీద పెద్ద పిడుగు పడ్డంత పనయింది.

ఘోరం ! మహా ప్రమాదం! చెయ్యవద్దనుకున్న

పనే తను చెయ్యబోతున్నాడు! చెయ్యవలసి వస్తోంది!

ఇంతదూరం వస్తుందా అనుకున్నాడు.

ఇంత తక్కువ కట్నానికి వాళ్లు ఒప్పుకోరులే అనుకున్నాడు.

మొదలకుండా వూరుకుంటే వదినే, మామగారూ ఇంతదూరం తీసుకురారులే అనుకున్నాడు శేషు. కనుకనే గట్టిగా ఆలోచించలేదు. సావిత్రి సలహా తీసుకోలేదు. 'ఇప్పుడు పెళ్లి చేసుకోడం ఇష్టమేనా' అని సుశీలను అడగలేదు. ఇంతకూ ఇప్పుడేమిచెయ్యాలి?

అంతలో—ఆ క్షణంలో "మిమ్మల్ని ఓసారి మా అక్కయ్య పిలుస్తున్నది" అన్నది సావిత్రి. శేషుభార్య.

"క్షమించండి. ఇప్పుడే—క్షణంలో వస్తా—" అని శేషు లేచి వదినె వున్న గదిలోకి వెళ్ళాడు.

"మనసే మాయా
గురుడే మాయా"

రేడియో పాడ్తోంది. పెళ్లికొడుకు పాట వింటూ, ఇంటికప్పుకేసి చూస్తున్నాడు.

సుశీల నెమ్మదిగా లేచి తండ్రి వెళ్లిన గదిలోకి వెళ్ళింది.

పెళ్ళికొడుకుతండ్రికి ఏమీ తోచడం లేదు.

"పసుపు పూసి
కాడి చూపీ
గాడికి రమ్మనడం

గారడీ—

పెద్ద గారడీ''

పాడుతోంది రేడియో.

పెళ్ళికొడుకుతల్లీ, సావిత్రీ పెళ్ళి ఏర్పాట్లను చర్చిస్తున్నారు.

*    *    *

''అట్లా నీళ్లు నములుతారేం? వాళ్ళకు ఎప్పుడు వీలవుతుందో చెప్పమనండీ?'' అన్నది వదినె గదిలో.

మొదట్లోనే చెబితే సరిపోయేది. ఇంతదూరం రాకుండా పోయేది. ఇప్పుడప్పుడే నా పిల్లకు పెళ్ళిచెయ్యనని మొదట్లోనే చెబితే ఇంతదూరం వచ్చేది కాదు ఈ వ్యవహారం.

నా పిల్ల స్కూల్ ఫైనలయితే చదివింది కాని ఇంకా పన్నెండేండ్లు నిండలేదు. ప్రపంచం పోకడ దానికేమీ తెలియదు. సంసారంలో వచ్చే ఎగుడు దిగుళ్ళను సరిదిద్దుకోగల నిబ్బరం దానికి లేదు.

వీటన్నింటికంటె దానంతట అది ఏదయినా పని చేసుకొని జీవించగలిగేవరకూ మేము దానికి పెళ్ళి చెయ్యదలుచుకోలేదని మొదటనే చెపితే ఈ వ్యవహారం ఇంత దూరం వచ్చేదికాదు.

''మాట్లాడరేం? అవతల పెద్దమనుషులు కూర్చొనున్నారు. ఎగతాళి పాలయిపోతాం. తొందరగా వెళ్ళి వాళ్ళకు ఎప్పుడు వీలో అడగండి''—తొందరచేస్తున్నది వదినె.

శేషు కాళ్లు వణుకుతున్నయ్. గొంతు ఎండిపోతోంది. చెమటలు కమ్ముకొస్తున్నయ్. నోట్లోంచి మాటరాదు.

ఇంతదూరం వస్తుందని అనుకోలేదు శేషు.

"మంచి సంబంధం" అని మొదటిసారి వదినె ప్రస్తావించినప్పుడూ, "మేము బతికుండగా నీ పెద్దకూతురు పెళ్ళి చేస్తావా?" అని మామగారు అన్నప్పుడూ, "చూద్దాం. కలిసివస్తే తప్పకుండా చేస్తాను" అన్నప్పుడూ ఈ గొడవ ఇంతదూరం వస్తుందని ముగ్గురు ఆడపిల్లల తండ్రి—బడి పంతులు శేషు అనుకోలేదు.

"ఏమి నాయనా—బయటికి రారేం? వాళ్లు నీకోసం కూర్చున్నారు" అంటూ మామగారుకూడా శేషుఉన్న గది లోకి వచ్చాడు.

ఏమీ తోచడంలేదు. ఇంత తొందర చేస్తారేం? వీళ్ళంతా ఎందుకూ తన గొంతుమీద ఇట్లా కూర్చుంటారూ? అంతా కుట్ర చేశారు. దగా చెయ్యాలని చూస్తున్నారు.

"డబ్బు సంగతికేమీ దిగులుపడవద్దు. ఇంకా మేము బతికేవున్నాంగా!" అన్నాడు మామగారు.

అవును. అందరూ బతికే వున్నారు. కాని, ఎక్కడో ఏదో మహాప్రమాదం ముంచెత్తుకొచ్చినంత బాధ. ఎట్లా? ఎట్లా? ఏంచెయ్యాలి?

కూతురువంక చూచాడు శేషు. తండ్రి వంక అదే పనిగా చూస్తోంది సుశీల.

"మనసులోని మర్మ మేమిటయా
గురుడా

మగువ మనసులోని మర్మ మేమిటయా
గురుడా
మర్మ మేమిటయా''

రేడియో పాడుతోంది.

శేషు ఇంత అవస్థపడుతున్నా, ఈ గండంనుంచి ఎట్లా బయటపడాలని తల పగలగొట్టుకున్నా, చీమకుట్టినంత బాధన్నా లేనట్టు, సావిత్రి, రేడియోతో కాలక్షేపం చేస్తోంది.

పెళ్ళికొడుకు రేడియో పాటలమీద వ్యాఖ్యానాలు చేస్తున్నాడు.

''ఆ పిల్లవాడు నీకు నచ్చాడా తల్లీ!'' అన్నది వదినె.

సుశీల సమాధానం చెప్పలేదు.

''చెప్పు పాపా—ఆ అబ్బాయి బావున్నాడా? చెప్పమ్మా!'' అన్నాడు శేషు.

సుశీల సిగ్గుపడలేదు.

సుశీల సమాధానం చెప్పలేదు.

ఏడుపుముఖం పెట్టింది.

''ఇక లేద్దామా?'' అన్నాడు పెళ్లికొడుకు తండ్రి.

''ఆ కాస్త మాటా కూడా అనుకుని వెళ్తే''—నసి గాడు మధ్యవర్తి.

''ఊళ్లోనేగా—వెళ్ల వచ్చులెండి. కాఫీ తీసుకుని'' అన్నాడు శేషు బావమరిది.

''ఇప్పుడేం కాఫీలూ? అయినా, కలికితే అతక

దంటారు'' అన్నది పెళ్లికొడుకు తల్లి.

"అబ్బే—ఇది మా ఇల్లండీ. మీా వియ్యాలవారి ఇల్లు కాదు'' అన్నాడు శేషు బావనురిది.

*　　　*　　　*

"ఏమిట్రా—ఏం చేస్తున్నా రిక్కడ? ఎంత సేపటికీ తెమిలిరారేం?'' అంటూ సావిత్రి వచ్చింది గదిలోకి.

ముసలాయనకు శేషుసంగతేమీా అర్థంకావడంలేదు. ఇరవై సంవత్సరాలుగా తన మాటను కాదనని అల్లుడు ఇప్పుడు ఇట్లా చేస్తున్నాడేం?''

తనంటే ఎంతో గౌరవం గల మరది ఇవాళ ఇట్లా ఎందుకయిపోయినాడో తెలియక వదినె తికమక పడు తోంది.

ఇరవై వేల కట్నంతో ముప్ఫయి ఎకరాల ఆసామీాకి భార్య అయి, పది సంవత్సరాలు యమయాతన పడి క్షయతో అక్క చచ్చినందున శేషు పెళ్లి చేసుకోరాదను కున్నాడని వీరి కెవరికీ తెలియదు.

అయిదువేల కట్నంతో బంగారపు బొమ్మవంటి మేనకోడల్ని పదెకరాల ఆసామీాకి ఇస్తే సినిమా తార మాదిరిగా ఆడలేదని, పాడలేదని ఆ పిల్లను ఆ ఆసామీా వదిలేశాడు కనుక పెళ్లి అనే దొక పెద్ద గారడీ అని శేషు నిర్ణయించుకున్నాడని వీరి కెవరికీ తెలియనే తెలియదు.

నలుగురు మగపిల్లలకు చదువు చెప్పించి, ముగ్గురు

ఆడపిల్లలకు పెళ్లిళ్లుచేసి కాపరానికి పంపించేప్పటికి ముప్ఫయి ఎకరాల ఆసామి తన తండ్రి దివాలా తీశాడని పెళ్లి చేసుకోనే చేసుకోవద్దని శేషు నిశ్చయించుకున్నాడని వీళ్లకు తెలియదు.

శేషు తన చేతులమీదుగా కూతురికి పెళ్లి చెయ్య దలచుకోలేదని సావిత్రికి తెలుసు.

"నువ్వన్నా అడగమ్మా. ఆ అబ్బాయి పాపకు నచ్చాడా? ఇంతకంటే మంచి సంబంధం తీసుకురాలేముగా మరి" అన్నది వదినె.

"అదా...అదా సంగతి? అందుకేనా అందరూ అట్లా కూర్చున్నారు? కొంపంతా మునిగిపోయినట్టు కూర్చున్నారు, ఇందుకేనా? పాపా...ఇట్లా రా......నా దగ్గరికి రా తల్లీ" అన్నది సావిత్రి.

సుశీల పరుగున పోయి తల్లి ఒడిలో తల పెట్టుకొని ఏడుస్తోంది!

శేషు గబగబా బయటికి వెళ్లి హాలులో పెళ్లికొడుకు ఎదురుగా కూర్చున్నాడు. టేబిల్ మీది పత్రికలను తిరగ వేస్తున్నాడు పెళ్లికొడుకు.

"మరి మీరు కాఫీ" అన్నాడు మధ్యవర్తి.

"బావగారు తరువాత తీసుకుంటారు లెండి" అన్నాడు శేషు బావమరిది.

శేషు బావమరిదికేసి చూశాడు. ఆ తరువాత ఎదుటి గోడవంక చూస్తూ "నాలుగైదు రోజులలో వచ్చి మిమ్మల్ని

కలుసుకుంటానండీ సుబ్బారావుగారూ'' అన్నాడు.

''అయితే మేము వెళ్ళివస్తాం. ప్రెస్‌కి వెళ్ళాలి'' అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

పెళ్ళికొడుకు కలవరపడ్డాడు. పెళ్లికొడుకు తల్లి తికమకపడింది. పెళ్లికొడుకు చెల్లెలికి కోపం వచ్చింది.

''వచ్చే నెలలో ముహూర్తా లున్నయ్. తొందరగా అనుకుంటే మంచిది బాబూ'' అన్నాడు మధ్యవర్తి.

''తొందర్లోనే వస్తాంలెండి'' అన్నాడు శేషు బావమరిది.

అందరూ లేచారు. శేషు లేవలేదు. పెళ్లివారిని సాగనంపడానికి అందరూ బయటికి వెళ్లారు.

అమ్మయ్య! ఇప్పటికి గండం తప్పింది.—గండం తప్పిపోయింది. మొదట్లోనే చెపితే ఇంత దూరం వచ్చేది కాదు. ఎందుకు చెప్పలేదూ?

ఇట్లా ఎందుకు జరిగిందీ?

ఈ వ్యవహారం ఇంతదూరం ఎందుకు వచ్చిందీ?

'వెండిచెంబులూ, పట్టు బట్టలూ, నూటపదహారు రూపాయల కట్నాలకు బీకామ్ పాసయిన పిల్లవాడు ఒప్పుకొన్నాడులే' అనుకున్నాడు శేషు.

తనదగ్గర డబ్బులేదని అందరికీ తెలుసు. వెయ్యి రూపాయలు మామగారు ఇప్పుడు ఎక్కడ తీసుకురాగలడు అన్నాడు శేషు.

''పెళ్ళికూతురు మాదిరిగా అట్లా కూచున్నావేం

బావా?'' అన్నాడు శేషు బావమరది బయటినుంచి వస్తూ. ఆ మాటలు శేషుకు వినిపించవు.

తెలివిగల పిల్ల సుశీల. ఏదయినా ఓ వృత్తిలో చేరే వరకూ పెళ్లి చెయ్యరాదనుకొన్నాడు శేషు. అయితే, మరి ఈ గొడవంతా ఏమిటి? ఎవరూ, దీని కంతటికీ కారణ మెవరూ?

చదువు చెప్పిద్దామని, ఉద్యోగం చేయిద్దామని ఇప్పుడు అనుకొంటున్నాడు తను. సంసార భార మెక్కువై చెప్పించలేకపోతే?

తన తల్లిదండ్రులూ, అత్తమామలూ అందరూ ఇట్లాగే చిన్నచిన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశారు. వాళ్ళను తను ఎదిరించగలడా?

తీరా పెళ్లి చెయ్యవలసి వచ్చేప్పటికి అత్తమామలు సహాయం చెయ్యకపోతే?

ఇంత తక్కువ కట్నానికి ఇంత మంచి సంబంధం దొరక్కపోతే?

సుశీల తనకు ఎదురు తిరిగితే?...అందుకే...అందువల్లనే...భయాలవల్లనే తన నిర్ణయాన్ని శేషు ఇతరులకు చెప్పలేకపోయినాడు. అందువల్లనే ఈ వ్యవహారమంతా ఇంతదూరం వచ్చింది. ఇక ఇప్పుడు ఏమి చెయ్యాలి?

తన కూతురు సుఖంగా బతకాలి.

మగవాడి దౌర్జన్యానికి తన కూతురు బలి కారాదు. నీతి నియమాలతో తన కూతురు బతకాలి.

పెద్ద అవరోధం! పెద్ద చిక్కు!

తన చేతులమీదుగా తన కూతుర్ని గోతిలోకి తొయ్యలేదు.

ఇప్పటికి ఈ గండం తప్పింది. ఈ నాలుగైదురోజుల గడువు ఎప్పటికీ పూర్తికాకపోతే,—పోనీ ఈ నాలుగైదు రోజులలో ఇంతకంటే మంచి సంబంధం వాళ్లకి దొరికితే,—అదీ కాకపోతే 'ఆ అమ్మాయి నాకు నచ్చలే'దని అబ్బాయి వాళ్ళ తల్లిదండ్రులకు ఎదురు తిరిగితే,—వాళ్ళకూ, తమకూ ఈ నాలుగైదురోజులలో పెద్ద అవాంతర మేదన్నా ముంచుకు వస్తే బాగుండునని శేషు అనుకుంటాడు.

అంతేగాని ఇప్పుడప్పుడే నా కూతురికి పెళ్లి చెయ్యనని ఖచ్చితంగా చెప్పలేని శేషు తలఎత్తి చూచేప్పటికి వదినె, సావిత్రి, బావమరదీ తనను చూచి నవ్వుతున్నారు.